## బాలికతో నగ్న పూజలకు యత్నం

పెద్దపల్లి, నవంబర్ 25(నమస్తే తెలంగాణ)/మంథని రూరల్ : పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని బాలికల వసతి గృహంలో సోమవారం రాత్రి బాలికతో నగ్నపూజలకు యత్నించిన ఘటన కలకలం రేపింది. పొరుగు జిల్లాకు చెందిన ఒక విద్యార్థిని, తన సోదరితో కలిసి మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో ఉంటున్నది. వారి పేదరికాన్ని ఆసరాగా చేసుకున్న హాస్టల్‌లో పనిచేసే వంట మనిషి ఆ ఇద్దరు విద్యార్థులను చేరదీసి నట్టుగా నటిస్తూ.. పెద్దమ్మాయికి మాయ మాటలు చెప్పింది. నగ్న పూజలు చేస్తే కనకవర్షం కురుస్తుంది. ఆ డబ్బుతో మీ కుటుంబం సంతోషంగా ఉండవచ్చు' అని చెప్పింది. వారం క్రితం వంట మనిషి పర్సనల్ రూంకు ఓ వ్యక్తిని తీసుకువచ్చి బాలికను పిలిపించి అతని ముందర నగ్నంగా ఉంటే ప్రత్యేక పూజలు చేస్తారని చెప్పింది. దీంతో ఆ విద్యార్థిని భయంతో హాస్టల్ నుంచి మంథని పట్టణంలో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లి నాలుగు రోజులుగా తలదాచుకున్నది. తల్లిదండ్రులకు విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు హాస్టల్ వద్దకు వచ్చి సదరు వంట మనిషిని నిలదీశారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా సీఐ రాజు, ఎస్‌ఐ రమేశ్ చేరుకొని ఘటనపై ఆరా తీశారు. ప్రలోభ పెట్టిన మహిళను అదుపులోకి తీసుకొని, పోలీసు స్టేషన్‌కు తరలించారు. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్టు మంథని ఎస్‌ఐ తెలిపారు. పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకోనున్నట్టు వివరించారు.

## ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి హౌస్ అరెస్ట్

కుమ్రంభీం ఆసిఫాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ మృతి చెందిన నేపథ్యంలో వాంకిడిలో ప్రజా సంఘాల వారు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి ఆందోళన చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఈ ఆందోళనకు మద్దతు పలికి పాల్గొనేందుకు బయలుదేరుతున్న క్రమంలో పోలీసులు ఆమె ఇంటిని చుట్టుముట్టారు. ఎమ్మెల్యే బయటికి రాకుండా హౌస్ అరెస్ట్ చేశారు. విద్యార్థిని మృతితో అప్రమత్తమైన ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు, ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం.. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన పోలీసులను వాంకిడి, ఆసిఫాబాద్ మండల కేంద్రంలో మోహరించారు.

# గురుకులాల్లో 48మంది మృతి

### 38 సార్లు ఫుడ్‌పాయిజన్, 886 మందికి అస్వస్థత
### కాంగ్రెస్ పాలనలో హాస్టళ్లు అస్తవ్యస్తం
### ప్రాణాలు పోతున్నా పట్టించుకోని రేవంత్ సర్కారు
### విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల విమర్శలు

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పాలనలో విద్యాకుసుమాలు ఆదిలోనే వసివాడిపోతున్నాయి. ఆహార కలుషితంతో విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. 27 రోజులుగా మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచిన విద్యార్థిని శైలజ మరణం గురుకులాల్లో మృత్యుఘోషకు నిలువెత్తు నిదర్శనం. కాంగ్రెస్ పాలనలో ఒక్కరు కాదు.. ఇద్దరు కాదు ఏకంగా 48 మంది విద్యార్థులు మృతి చెందడం విషాదకరం. ఇంత జరుగుతున్నా సర్కారులో చలనం లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి.

#### విద్యావ్యవస్థను వీడని నిర్లక్ష్యం

ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో ఎక్కడ చూసినా నిర్లక్ష్యం తాండవిస్తున్నది. ఏడాదిగా హాస్టళ్లలో అనుమానస్పద మరణాలు, బలవన్మరణాలు, అనారోగ్యం, కలుషిత ఆహారం తిని చనిపోవడం వంటి ఘటనలు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వం విచారణ కమిటీలు ఏర్పాటు చేయడం, వార్డెన్‌ను, ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయడంతో సరిపెడుతున్నది. సమస్యకు మూల కారణాలు కనుక్కొని శాశ్వత పరిష్కారం చూపడంపై దృష్టి సారించడం లేదు. కనీసం మంత్రులు సమీక్ష జరపడం లేదంటే ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని అర్థం చేసుకోవచ్చని విద్యార్థి, ఉపాధ్యాయ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

#### ప్రాణాలు తీస్తున్న నాసిరకం సరుకులు

గురుకులాల్లో ఆహార కల్తీకి నాసిరకం సరుకులే కారణమని విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు. కాంట్రాక్టర్లు నాణ్యత లేని సరుకులను సరఫరా చేస్తున్నారని చెబుతున్నారు. విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడడం కూడా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. కొత్తగా ప్రవేశపెట్టిన టైమ్ టేబుల్‌తో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని విద్యార్థి సంఘాల నేతలు, తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గురుకుల విద్యార్థుల దినచర్య ఉదయం 5 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉంటున్నదని చెబుతున్నారు. ఉదయం బ్రేక్ ఫాస్ట్ తర్వాత 8.15 గంటల నుంచి మధ్యాహ్నం 1:25 వరకు వరుసగా 7 పీరియడ్లను నిర్వహిస్తున్నారు. సాయంత్రం గేమ్స్ తర్వాత పర్సనల్ టైమ్ 15 నిమిషాలే ఇస్తున్నారు. ఫలితంగా విద్యార్థులపై ఒత్తిడి ఎక్కువ అవుతున్నందున ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు వివరిస్తున్నారు.

#### ఉపాధ్యాయులపైనా పని ఒత్తిడి

పనిఒత్తిడి కారణంగానే తాము కూడా విద్యార్థుల పర్యవేక్షణపై ఎక్కువ దృష్టి సారించలేకపోతున్నామని ఉపాధ్యాయులు వాపోతున్నారు. ఉపాధ్యాయులకు డైనింగ్, వాటర్, శానిటరీ, కిచెన్ ఇన్‌స్పెక్షన్, ఏటీపీ రొటేషన్, స్టడీ అవర్స్ డ్యూటీ కూడా అప్పగించడం సరికాదని చెబుతున్నారు. తమ ఉద్యోగానికి, పనికి సంబంధమే లేదని అంటున్నారు. విద్యార్థులతోపాటు తాము కూడా మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### మృతిచెందిన విద్యార్థులు

| క్ర.సం | జిల్లా | గురుకులం/హాస్టల్ | తేదీ | విద్యార్థి పేరు | కారణం |
|---|---|---|---|---|---|
| 1) | నల్లగొండ | ఎస్సీ | 23/01/2024 | భార్గవి | (అనుమానాస్పదం) |
| 2) | కరీంనగర్ | ఎస్సీ | 30/01/2024 | అక్షిత | (ఆత్మహత్య) |
| 3) | వరంగల్ | మోడల్ స్కూల్ | 31/01/2024 | ఎదునూరి ఉదిత్ | (ఆత్మహత్య) |
| 4) | భువనగిరి యాదాద్రి | ఎస్సీ | 04/02/2024 | భవ్య | (ఆత్మహత్య) |
| 5) | భువనగిరి యాదాద్రి | ఎస్సీ | 04/02/2024 | వైష్ణవి | (అనుమానాస్పద మృతి) |
| 6) | నిర్మల్ | మైనార్టీ | 09/02/2024 | అర్చాజ్ | (ఆత్మహత్య) |
| 7) | సూర్యాపేట | ఎస్సీ | 11/02/2024 | దగ్గుబాటి వైష్ణవి | (ఆత్మహత్య) |
| 8) | సూర్యాపేట | ఎస్సీ | 19/02/2024 | ఇరుగు అస్మిత | (ఆత్మహత్య) |
| 9) | ఆదిలాబాద్ | ట్రైబల్ | 29/02/2024 | తొడసం మహేశ్వరి | (అనారోగ్యం) |
| 10) | నిజామాబాద్ | బీసీ | 05/03/2024 | వెంకట్ | (అనుమానిత మృతి) |
| 11) | భద్రాద్రి కొత్తగూడెం | ట్రైబల్ | 01/04/2024 | వర్ధిత | (అనారోగ్యం) |
| 12) | భద్రాద్రి కొత్తగూడెం | ట్రైబల్ | 01/04/2024 | తేజస్వి | (అనారోగ్యం) |
| 13) | భద్రాద్రి కొత్తగూడెం | ట్రైబల్ | 02/04/2024 | కాక వర్షిత | (అనారోగ్యం) |
| 14) | ఆదిలాబాద్ | ఎస్సీ | 05/04/2024 | వర్ధిత | (ఆత్మహత్య) |
| 15) | ఖమ్మం | మైనార్టీ | 08/04/2024 | కన్నబోయిన వేణుగోపాల్ | (అనారోగ్యం) |
| 16) | యాదాద్రి భువనగిరి | ఎస్సీ | 17/04/2024 | చిన్నలచ్చి ప్రశాంత్ | (ఫుడ్‌పాయిజన్) |
| 17) | నల్లగొండ | బీసీ | 26/04/2024 | గీతాంజలి | (ఆత్మహత్య) |
| 18) | హైదరాబాద్ | ఎస్సీ | 04/05/2024 | పతిరి యాకయ్య | (ఆత్మహత్య) |
| 19) | మహబూబ్‌నగర్ | ఎస్సీ | 08/05/2024 | --- | (ఆత్మహత్య) |
| 20) | జనగాం | ఎస్సీ | 26/06/2024 | ఇస్లావత్ వర్షిణి | (ఆత్మహత్య) |
| 21) | జోగుళాంబ | కస్తూర్బా | 29/06/2024 | విజయశ్రీ | (ఆత్మహత్య) |
| 22) | సూర్యాపేట | ఎస్సీ బాలుర | 04/07/2024 | శ్యాంకుమార్ | (అనుమానిత మృతి) |
| 23) | మహబూబాబాద్ | ఆదర్శ గురుకులం | 06/07/2024 | అనురాధ | (ఆత్మహత్య) |
| 24) | కరీంనగర్ | అంధుల గురుకులం | 10/07/2024 | శ్రీవాత్సవ్ | (ఆత్మహత్య) |
| 25) | భద్రాద్రి కొత్తగూడెం | గురుకులం | 13/07/2024 | బుర్రా లిడియా | (ఆత్మహత్య) |
| 26) | సంగారెడ్డి | మోడల్ గురుకులం | 14/07/2024 | గాయత్రి | (ఆత్మహత్య) |
| 27) | భద్రాద్రి కొత్తగూడెం | కస్తూర్బా | 17/07/2024 | నిహారిక | (ఆత్మహత్య) |
| 28) | సూర్యాపేట | బీసీ గురుకులం | 17/07/2024 | సరస్వతీ | (అనుమానాస్పద మృతి) |
| 29) | హనుమకొండ | కస్తూర్బా | 18/07/2024 | నందు | (ఆత్మహత్య) |
| 30) | జగిత్యాల | బాలుర మోడల్ | 27/07/2024 | గణాదిత్య | (ఫుడ్‌పాయిజన్) |
| 31) | రంగారెడ్డి | ప్రభుత్వ గురుకులం | 09/08/2024 | నందిని | (అనారోగ్యం) |
| 32) | హనుమకొండ | ట్రైబల్ వెల్ఫేర్ | 10/08/2024 | పూజ | (అనారోగ్యం) |
| 33) | జగిత్యాల | ప్రభుత్వ గురుకులం | 10/08/2024 | అనిరుధ్ | (అనుమానాస్పద మృతి) |
| 34) | కుమ్రంభీం ఆసిఫాబాద్ | ఎస్సీ హాస్టల్ | 23/08/2024 | అనురాధ | (అనారోగ్యం) |
| 35) | నల్లగొండ | బీసీ గురుకులం | 25/08/2024 | చందన | (ఆత్మహత్య) |
| 36) | జగిత్యాల | మోడల్ స్కూల్ | 27/08/2024 | సందీప్ | (ఆత్మహత్య) |
| 37) | కామారెడ్డి | కస్తూర్బా గురుకులం | 07/09/2024 | సిద్ధేశ్వరి | (అనారోగ్యం) |
| 38) | ఆదిలాబాద్ | ఎస్టీ బాలుర | 22/09/2024 | జితేందర్ | (అనుమానాస్పద మృతి) |
| 39) | జోగుళాంబ గద్వాల | బీసీ వసతిగృహం | 27/09/2024 | మనీషా | (అనారోగ్యం) |
| 40) | ములుగు | ఎస్టీ గురుకులం | 28/09/2024 | చరణ్ | (అనారోగ్యం) |
| 41) | రంగారెడ్డి | కస్తూర్బా గురుకులం | 19/10/2024 | స్వాతి | (అనారోగ్యం) |
| 42) | నల్లగొండ | ఎస్టీ గురుకులం | 21/10/2024 | శిరీష | (ఆత్మహత్య) |
| 43) | ఆదిలాబాద్ | గిరిజన ఆశ్రమపాఠశాల | 27/10/2024 | గంగోత్రి | (ఫుడ్‌పాయిజన్) |
| 44) | నిర్మల్ | బీసీ గురుకులం | 06/11/2024 | అయాన్ | (అనుమానాస్పద మృతి) |
| 45) | జగిత్యాల | కస్తూర్బా గురుకులం | 09/11/2024 | నిత్యశ్రీ | (అనారోగ్యం) |
| 46) | ఆదిలాబాద్ | కస్తూర్బా గురుకులం | 09/11/2024 | అంజలి | (ఆత్మహత్య) |
| 47) | సంగారెడ్డి | బీసీ గురుకులం | 17/11/2024 | స్వాతి | (ఆత్మహత్య) |
| 48) | ఆసిఫాబాద్ | ఎస్టీ ఆశ్రమ పాఠశాల | 25/11/2024 | శైలజ | (ఫుడ్ పాయిజన్) |

## ఏడాదిలో 23 మంది ఆత్మహత్య

ఈ ఏడాది జనవరి 22న నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి ఎస్సీ గురుకులంలో 9వ తరగతి విద్యార్థిని భార్గవి ప్రార్థన సమయంలో కండ్లు తిరిగిపడిపోయింది. దవాఖానకు తరలించగా అప్పటికే భార్గవి మృతి చెందినట్టు డాక్టర్లు స్పష్టంచేశారు. ఇలాంటి వరుస ఘటనలతో విద్యార్థుల మొత్తం మరణాలు 48కి చేరాయి. ఇందులో 23 బలవన్మరణాలు, 8 అనుమానాస్పద ఘటనలు కాగా ఫుడ్‌పాయిజన్‌తో నలుగురు మృతి చెందారు. అనారోగ్యంతో 13 మంది విద్యార్థులు చనిపోయారు. ఎస్సీ గురుకులాల్లోనే 13 మంది చనిపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏడాది 38 గురుకులాల్లో కలుషితాహార ఘటనల్లో 886 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా నలుగురు చనిపోయారు. ప్రభుత్వం ఇకనైనా గురుకులాలపై దృష్టి పెట్టాలని విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మలక్‌పేట పోలీస్‌స్టేషన్ ముందు ఆందోళన చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు

## లంబాడ విద్యార్థినిపై లైంగిక దాడి.. హత్య?

- కన్సల్టెన్సీ కార్యాలయంలో విగతజీవిగా శ్రావ్య
- ఒంటిపై లెగ్‌ఇన్ మాయం.. గదిలో రక్తపు మరకలు
- హత్యాచారం చేశారని కుటుంబ సభ్యుల ఆందోళన

మలక్‌పేట, నవంబర్ 25 : కన్సల్టెన్సీలో పనిచేస్తున్న తమ కూతురిని పని ఉన్నదని పిలిచి లైంగికదాడితోపాటు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపిస్తూ సోమవారం మధ్యాహ్నం మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు, గిరిజన సంఘాలు ఆందోళనకు దిగారు. దీంతో ట్రాఫిక్ భారీగా స్తంభించింది. పోలీసులు రంగంలోకి ఆందోళన విరమింపజేశారు. రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం, తక్రాజ్‌గూడతండాకు చెందిన ఇస్లావత్ రమేశ్‌నాయక్‌కు ఇద్దరు కూతుళ్లు ఇస్లావత్ శ్రావ్య(20), శ్రుతి, కుమారుడు సాయికిరణ్ ఉన్నారు. పెద్ద కూతురు శ్రావ్య ఎల్‌బీనగర్ చిత్రా లేఅవుట్‌లోని మహాత్మాగాంధీ లా కాలేజీలో ఎల్‌ఎల్‌బీ ఫోర్త్ ఇయర్ చదువుతూ ఎల్‌బీనగర్ మెట్రోస్టేషన్ పక్కన గర్ల్స్ హాస్టల్‌లో ఉంటుంది. లా చదువుతూనే మూసారంబాగ్ సలీంనగర్‌లోని నందిని రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో అడ్వకేట్ వద్ద ఏడాదిన్నరపాటు పనిచేసింది. మూడు నెలలక్రితం అదే అపార్ట్‌మెంట్‌లో జైదుర్గ కన్సల్టెన్సీలో(ఎడ్యుకేషనల్)నిర్వాహకుడు నవీన్ వద్ద మూడు నెలలుగా పనిచేస్తున్నది. ఆదివారం సాయంత్రం కన్సల్టెన్సీకి వెళ్లిన శ్రావ్య తన తమ్ముడికి ఫోన్‌చేసి డబ్బులు పంపమనగా రూ.20 వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత ఏడున్నర కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవటంతో ఆందోళనకు గురైన అతను శ్రావ్యతోపాటు హాస్టల్‌లో ఉంటున్న బంధువు శిరీషకు ఫోన్‌చేసి వాకబ్ చేయమన్నాడు. శిరీష విషయాన్ని మరో ఫ్రెండ్ సోనీకి తెలిపింది. సోనీ తన స్నేహితుడు కార్తీక్‌తో కలిసి కన్సల్టెన్సీకి వెళ్లారు. అక్కడ అడ్వకేట్ సామల రవీందర్‌తోపాటు గ్రౌండ్‌ఫ్లోర్‌లోని మరో మహిళతో వెళ్లి కార్యాలయం ముందు శ్రావ్య చెప్పులను గమనించి తలుపులు తట్టిచూడగా లోపలివైపు గడియపెట్టి ఉంది. కిటికీలోంచి తొంగి చూడగా శ్రావ్య సీలింగ్ ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. శ్రావ్యను అడ్వకేట్ రవీందర్ కారులో మలక్‌పేట యశోద దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించి మలక్‌పేట పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్సై సురేశ్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. రాత్రి 10 గంటలకు మృతురాలి తల్లిదండ్రులకు సమాచారమివ్వగా వారు బంధువులతో నగరానికి వచ్చారు.

#### శ్రావ్య మృతిపై అనుమానాలు..

కన్సల్టెన్సీ కార్యాలయానికి లెగ్‌ఇన్‌తో వెళ్లిన శ్రావ్య ఒంటిపై లెగ్‌ఇన్ లేకపోవడం, ఫ్యాన్‌కు వేలాడుతూ ఉన్న గదిలో రక్తపు మరకలు ఉండటం పలు అనుమానాలకు తావిస్తున్నదని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, గిరిజన సంఘాల నాయకులు ఆరోపించారు. కన్సల్టెన్సీ నిర్వాహకుడు నవీన్, అతని అనుచరుడు కలిసి శ్రావ్యపై లైంగికదాడి, హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని మృతురాలి తల్లిదండ్రులు ఇస్లావత్ రమేశ్‌నాయక్, కంసీ, వారి బంధువులు ఆరోపించారు. లెగ్‌ఇన్‌తో వచ్చిన శ్రావ్య ఒంటిపై లెగ్‌ఇన్ లేకపోవటం, నిర్వాహకులు కనిపించకపోవడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయని రాష్ట్ర గిరిజన లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, ఉపాధ్యక్షుడు సంతోష్‌నాయక్, కోశాధికారి బాలునాయక్, సంయుక్త కార్యదర్శి జామ్లానాయక్, రాష్ట్ర గిరిజన మహిళా లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు లలితానాయక్ పేర్కొన్నారు. ఈ ఘటనపై దర్యాప్తుచేసి నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

#### మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలి

కన్సల్టెన్సీ నిర్వాహకులు లైంగికదాడి, హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. బాధిత కుటుంబానికి రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి.

**– అశోక్ రాథోడ్,**
**గిరిజన సంఘాల జేఏసీ అధ్యక్షుడు**

# పాపం శైలజ.. ప్రాణం పోయింది!

మొదటిపేజీ తరువాయి...

అస్వస్థతకు గురయ్యారు. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినులు ఇ మహాలక్ష్మి, కే జ్యోతి, సీ శైలజను ఈ నెల 5న నిమ్స్ దవాఖానలో చేర్చారు. ఇద్దరు విద్యార్థినులు కోలుకోగా 14న డిశ్చార్జి అయ్యారు. శైలజ పరిస్థితి రోజు రోజుకు దిగజారుతూ వచ్చింది. కల్తీ ఆహారం ఆమె ఊపిరితిత్తులు, మూత్రపిండాలపై ప్రభావం చూపింది. ఈ నెల 5న ఐసీయూకు తరలించారు. పరిస్థితి మరింత విషమించడంతో ఆర్ఐసీయులో చికిత్సను అందించారు. కానీ వైద్యుల ప్రయత్నాలు ఫలించలేదు. శైలజ సోమవారం తుదిశ్వాస విడిచింది.

#### గుట్టు చప్పుడు కాకుండా తరలింపు

ప్రభుత్వ పెద్దల ఒత్తిడితో మృతదేహాన్ని నిమ్స్ వైద్యులు గుట్టుచప్పుడు కాకుండా పోలీసు బందో బస్తుతో పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖాన మార్చురీకి తరలించారు. ఈస్ట్ జోన్ పరిధిలోని చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి పర్యవేక్షణలో ముందస్తుగా గాంధీ దవాఖాన మెయిన్ గేటు, మార్చురీ గేటు వద్ద పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి పోలీసు బందోబస్తు నడుమ రాత్రి ఏడు గంటలకు బాలిక మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

#### శోకసంద్రంలో తల్లిదండ్రులు

బాలిక మృతి చెందడంతో దవాఖానలో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ విగతజీవిగా

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి మండలం దాబా గ్రామంలోని శైలజ ఇల్లు

మారడం చూసిన కన్నవారు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. బంగారు భవిష్యత్ కోసం బిడ్డను ఆశ్రమ పాఠశాలలో చేర్పిస్తే ఇప్పుడు ఇలా చూడాల్సి వస్తుందని అనుకోలేదని విలపించారు. శైలజ స్వగ్రామం కుమ్రంభీం ఆసిఫాబాదబాద్ జిల్లా వాంకిడి మండలం దాబా గ్రామం. తల్లిదండ్రులు చౌదరి తుకారాం, మీరాబాయి వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు పిల్లలను చదివిస్తున్నారు. శైలజ వాంకిడిలోని ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదివేది. కుమారుడు వాంకిడి జడ్పీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు.

#### మమ్ముల చూసుకుంటుందని ఆశపడ్డం

హాస్టల్‌లో దీపావళి రోజు మా బిడ్డకు వాంతులు అయినయ్. ఈ విషయం మాకు రెండు రోజుల దాకా ఎవరూ చెప్పలే. దవాఖానకు తీసుకపోయేటప్పుడు సీరియస్‌గా ఉందని చెప్పిర్రు. నిమ్స్‌లో చేర్పించి 20 రోజులైతాంది. బిడ్డ ఆరోగ్యం గురించి డాక్టర్లు, అధికారులు ఎవ్వరూ స్పష్టత ఇవ్వలేదు. డాక్టర్లను అడిగినప్పుడల్లా ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేమన్నరు. గ్యారెంటీ ఇవ్వలేమన్నరు. మా బిడ్డ చనిపోయే దాకా మాకు ఏదీ సరిగా చెప్పలే. మంచిగ చదువుకొని మమ్ముల చూసుకుంటదని ఎంతో ఆశపడ్డం. మా పాపచావుకు అధికారులే కారణం.

**–మీరాబాయి, శైలజ తల్లి**

#### ఆశలన్నీ శైలజపైనే ఉండేవి

మేన కోడలు శైలజ చదువులో చురుకుగా ఉండేది. శైలజ తండ్రి తుకారాం తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివిస్తున్నాడు. శైలజ ఉన్నత చదువులు చదువుకొని మంచి స్థాయికి వెళ్తుందని ఎంతో ఆశ పడ్డారు. ఆమె చనిపోతుందని అస్సలు అనుకోలేదు.

**– నాందేవ్, శైలజ మేనమామ**

#### ప్రాణాలతో తిరిగి వస్తుందనుకున్నం

మా తమ్ముడి కూతురు శైలజ ప్రాణాలతోనే తిరిగి వస్తుందనుకొని ఎంతో ఆశ పడ్డం. హైదరాబాద్‌లోని పెద్ద దవాఖానలో చేర్పించిర్రు అన్నరు. ఏం కాదనుకున్నం. కానీ చివరికి మా బిడ్డ శవాన్ని అప్పగిస్తరనుకోలేదు. బిడ్డ చావుకు అధికారులే బాధ్యత వహించాలి. మా ఇంటికి పెద్దదైన శైలజపై మేము ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. చివరికి మరణవార్త వినాల్సి వచ్చింది.

**– వడాయి కన్ను, శైలజ పెద్దనాన్న**

# ముద్దల అన్నం.. మాకొద్దు!

- ఓల్డ్ హైస్కూల్ విద్యార్థుల నిరసన
- నెలరోజులుగా ఇదేతీరు అంటూ ఆవేదన
- కరీంనగర్‌లో తల్లిదండ్రులు ఆగ్రహం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, నవంబర్ 25: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్‌లో ముద్దలుగా, మాడిపోయిన అన్నం వడ్డించడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. తమకు రోజూ ఇలాంటి అన్నం పెడుతున్నారని.. ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులకు ఎన్నిసార్లు విన్నవించినా తమ గోడు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. సోమవారం 'ముద్దల అన్నం.. మాకొద్దు' అంటూ అన్నం గంజుతో పాఠశాల ప్రాంగణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నెలరోజుల నుంచి ఇలాంటి అన్నమే పెడుతున్నారని, ఒక్క రోజూ కూడా మెనూ పాటించడంలేదని, మధ్యాహ్నం భోజనంలో సాంబార్‌తో సరిపెడుతున్నారని వాపోయారు. ఇది ఏమిటని ప్రశ్నిస్తే ప్రభుత్వం నుంచి ఇవే వచ్చాయి.. ఇవే పెడతాం.. తింటే తినండి, లేకుంటే లేదు. అంటూ సిబ్బంది తమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓల్డ్ హైస్కూల్ ప్రాంగణంలో అన్నం గంజుతో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

### ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యమే వండుతున్నాం

మధ్యాహ్న భోజన కార్మికురాలు కవిత మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యం, సామగ్రితోనే వంట చేస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై ఉదయం వంటల ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలు, ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లినట్టు వివరించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన బియ్యంతోనే వంట చేయాలని వారు సూచించడంతో వంట చేశామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని, తమ పిల్లలు ప్రతి రోజూ ఫోన్ చేసి ఆహారం సరిగ్గా ఉండడం లేదని, ఏమైనా తిన్నా డానికి పంపిచాలని కోరుతున్నారని తెలిపారు. తమ పిల్లలు మధ్యాహ్నం భోజనం చేయలేదని, తాము వండుతామని సిద్ధమయ్యారు. ఉపాధ్యాయులు కలుగజేసుకుని విద్యార్థులకు సరైన ఆహారం అందిస్తామని తెలుపడంతో శాంతించారు.

### ఎంత మంది బిడ్డలు మరణిస్తే నీ గుండె కరుగుతుంది?

ఎంత మంది బిడ్డలు మరణిస్తే నీ గుండె కరుగుతుంది? పెద్ద చదువులు చదివేందుకు గురుకులాల్లో చేరిస్తే మరో పేద గిరిజన బిడ్డను బలి తీసుకుంటివి. 20 రోజులుగా నిమ్స్‌లో ఉంటే కనీసం ఒక్కరోజైనా పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించలేదు. గురుకులాల్లో భద్రంగా ఉండాల్సిన అమాయక విద్యార్థులు రేవంత్‌రెడ్డి పనితీరు వలన నెలకు ముగ్గురు చొప్పున నేలరాలిపోతున్నారు. ముఖ్యమంత్రిగా నీకు పేదల పిల్లల బాధలు పట్టవాయే. విద్యాశాఖ మంత్రి లేక విద్యార్థులకు తిప్పలు తప్పవాయే. ఎంతమంది తల్లి దండ్రుల కడుపుకోతకు కారణం అవుతావు? ఎంతమంది బిడ్డలు మరణిస్తే నీ గుండెకరుగుతుంది రేవంత్?

**-కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

### ప్రభుత్వ నిర్లక్ష్యం.. గిరిజన బిడ్డకు శాపం

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం అభం శుభం తెలియని గిరిజన బిడ్డకు శాపంగా మారింది. రేవంత్‌రెడ్డి దుర్మార్గపు పాలనకు వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని శైలజ బలైపోయింది. తోటి విద్యార్థులతో ఆడుతూ పాడుతూ బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన చిన్నారి విహారం తిని కన్నుమూయడం కలచివేసింది. 25 రోజులుగా నువ్వు వెంటిలేటర్‌పై అనుభవించిన నరకానికి ప్రభుత్వమే జవాబుదారీ. నీ ప్రాణాలు బలి తీసుకున్న పాపం ఈ దుర్మార్గపు కాంగ్రెస్‌ను వెంటాడుతుంది. అడుగడుగునా సర్కారు నిర్లక్ష్యం, అధికారుల అలసత్వమే విద్యార్థిని ప్రాణాల మీదకు తెచ్చింది. విద్యార్థిని తల్లిదండ్రులకు భరోసా ఇవ్వడంలోనూ ప్రభుత్వం విఫలమైంది. సీఎం రేవంత్‌రెడ్డి నిరుపేద గిరిజన తల్లిదండ్రులకు కడుపుకోతను మిగిల్చారు. చివరకు ఆ అమ్మాయి చావును కూడా దాచిపెట్టాలని దొంగచాటున మృతదేహాన్ని తరలించడం సిగ్గుచేటు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ. 50లక్షల పరిహారం చెల్లించాలి.

**-టీ హరీశ్‌రావు, మాజీమంత్రి**

### ఇది రేవంత్ సర్కార్ హత్యే